క్లుప్తంగా

160 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని రేగులగూడ పొలిమేరలో 160 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలో సారా బట్టీలపై దాడులు చేపడుతుండగా... సారా పట్టుబడిందన్నారు. నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పాలకొండ: నగర పంచాయతీలోని వెంకమ్మపేట వాటర్ ట్యాంక్ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో గ్రామంలోని 1, 2, 11, 12, 14, 17, 18, 20 వార్డుల పరిధిలో మంగళవారం నీటి సరఫరా ఉండదని కమిషనర్ సర్వేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వర్తక సంఘ కార్యవర్గం ఎన్నిక

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని శ్రీనివాస వర్తక సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక వర్తక సంఘం కార్యాలయం వద్ద జరిగిన ఈ ఎన్నికలో ఆ సంఘం అధ్యక్షుడిగా బుడంకాయల వెంకటరావు, ఉప అధ్యక్షుడిగా అత్తిలి శ్రీను, కార్యదర్శిగా మద్ది దొరబాబు, కోశాధికారిగా ఈపరి కామేశ్వరరావు, ఉప కోశాధికారిగా కొనిశ సూర్యప్రకాష్‌రావుతో పాటు కార్యవర్గ సభ్యులుగా బోటు గౌరీశంకర్, పొట్నూరు సురేష్, నెమలిపురి వెంకీ, కోరాడ మన్మథరావు, శివ, డోకి కిషోర్ తదితరులు ఎన్నికయ్యారు. ప్రతీ మూడేళ్లకు ఒకసారి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లు చెప్పారు.

నేడు ఎమ్మెల్యే కళావతి ప్రచారం

భామిని: మండలంలోని లివిరి, భామిని, బాలేరు, నల్లరాయిగూడ సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం ప్రచారం చేయనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీపీ టి.శాంతికుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా లివిరి గోపీనాథా రాధాకృష్ణుల సన్నిధిలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రచార కార్యక్రమాలు చేపడతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు

గరుగుబిల్లి: ఈ నెల 3న చినమేరంగిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు సోమవారం తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీలకు చెందిన విద్యార్థులు రెండొందల రూపాయలు.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 150 చొప్పున ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. మే 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 94403 22964 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలతో దశుమంతపురం వలంటీర్లు

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు చేరవేస్తూ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారధుల్లా ఉంటూ స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లను చూసి తెలుగుదేశం పార్టీ భయపడుతోందని దశుమంతపురం వలంటీర్లు పేర్కొన్నారు. తరచూ తమ సేవలపై బురదజల్లుతూ తప్పుడు ప్రచారాలు చేస్తున్న టీడీపీ తీరుకు మనస్తాపం చెంది వీరంతా సోమవారం వలంటీరు పోస్టులకు రాజీనామా చేశారు. మొన్నటికి మొన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేసి కించపరిచారని, అంతకు ముందు ఊరూరా వలంటీర్లు...అన్ని చోట్ల జగన్ అరాచకాలు అంటూ తప్పుడు కథనాలతో వలంటీర్లను విద్రోహులుగా చిత్రీకరించేందుకు రామోజీ ప్రయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలను పెట్టి ప్రజలను బందిపోటుల్లా దోచుకున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందేలా చేస్తున్నారని పేర్కొన్నారు. తమకు చక్కని భవిష్యత్తు ఇచ్చిన పాలకులకు అండగా ఉండేందుకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

బట్లబద్ర పంట పొలాల్లో ఏనుగుల గుంపు



జియ్యమ్మవలస: మండలంలోని బట్లబద్ర, నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగుల గుంపు సోమవారం ఉదయం సంచరించింది. సాయంత్రానికి పామాయిల్ తోట మీదుగా గుమ్మడిగెడ్డ వాగులోకి చేరాయి. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు.

ప్రతి అడుగులోనూ ఆశీర్వాదం..

- కళావతి ఎన్నికల ప్రచారానికి పోటెత్తిన ప్రజలు
- అడుగడుగునా పూలవర్షం



ఎమ్మెల్యే కళావతికి స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్న గొయిదాపేట యువత



సీఎం పురంలో హారతులతో స్వాగతం పలుకుతున్న ప్రజలు, మహిళలు



చిన మంగళాపురంలో ఎమ్మెల్యే ప్రచారం

పాలకొండ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తావని ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతిని ప్రజలు ఆశీర్వదించారు. తమ గ్రామాలకు వచ్చిన ప్రియతమ నాయకురాలిపై పూలవర్షం కురిపించారు. హారతులిచ్చి మనస్ఫూర్తిగా ఆశీస్సులు అందజేశారు. మండలంలోని గొట్ట మంగళాపురం, యరకారాయపురం, చిన్న మంగళాపురం పంచాయతీల్లో సోమవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ హయాంలో అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలు మూడోసారి కూడా గెలిపించాలని కోరారు. ముందుగా గొట్ట మంగళాపురంలో ఉదయం 8 గంటలకే ప్రజలు ప్రధాన రహదారిపైకి వచ్చి కళావతికి స్వాగతం పలికారు. జగనన్న పాలనలోనే ఆనందం ఉందని, ఆయనకే మద్దతిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. అనంతరం యరకారాయపురం వద్ద యువత తమ మద్దతు తెలియజేస్తూ స్వచ్ఛందంగా ప్రసారంలో పాల్గొన్నారు. నిన్న మొన్నటి వరకు ఇతర పార్టీల్లో ఉన్న వీరు జగనన్న ఫొటోలు, ఫ్యాన్ గుర్తును చూపిస్తూ చిందులు వేశారు. రానున్నది జగన్ ప్రభుత్వమే అని, జై జగన్ అంటూ.. కళావతి వెంట అడుగులు వేశారు. అనంతరం ప్రచారం చిన మంగళాపురంలోకి ప్రవేశించింది. అప్పటికే గ్రామ ముఖద్వారం వద్దకు చేరుకున్న ప్రజలు కళావతిపై పూలవర్షం కురిపించారు. జగన్ అందిస్తున్న పింఛన్ వల్ల ఆనందంగా జీవిస్తున్నామని చెబుతూ ఉద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, పార్టీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు కరణం బాబ్జీ, గోగులు కల్యాణి పాటు లోలుగు విశ్వేశ్వరరావు, టి.ఉపేంద్రకుమార్, వాడ్రాసి జనార్దనరావు, పార్టీ ముఖ్యనాయకులు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు, సలహా మండళ్ల అధ్యక్షులు, రైతు, యువజన సంఘాల ప్రతినిధులు నల్లి శివప్రసాద్, రణస్థలం రాంబాబు, బంకి లక్ష్మణమూర్తి, కోట అజేయ్‌కుమార్, మజ్జి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికలు



పాల్గొన్న బీఎల్‌ఓలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్

వీరఘట్టం: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించే బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ జయప్రకాష్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం, డీటీ చందక సత్యనారాయణ, ఆర్ లక్ష్మణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు



బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీటీ సత్యనారాయణ, ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: దివ్యాంగులు ఓటు వేసేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు.మండల కేంద్రంలోని బాలుర, బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 252, 254, 255 పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద ర్యాంపులు లేకపోవడంతో వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కేపీ నాగమణి, బి.సాంబర, ఎంఈఓ ఆర్. ఆనందరావు, ఆర్‌ఐ లక్ష్మణనాయుడు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక



గౌతమ్‌సాయి



తనీష్‌కుమార్



షర్మిల



కుప్పిలి తేజస్వి



శీరాపు నేతాజీ

సీతంపేట: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. దేవనాపురంనకు చెందిన వి. గౌతమ్‌సాయి, షర్మిల, పెద్దూరుకు చెందిన తనీష్‌కుమార్ ఎంపికైనట్లు ఎంఈఓ ఎం. ఆనందరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.

చిట్టపులివలస విద్యార్థి..

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస గ్రామానికి చెందిన కుప్పిలి తేజస్వి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో సత్తాచాటి ఆరో తరగతిలో సీటు సాధించింది. అలాగే నవోదయకు ఎంపికైన తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వడ్డి జీవన్, గేదెల దీపక్‌లను సెయింట్ జేవియర్స్ ప్రిన్సిపాల్ మెర్లీ, కరస్పాండెంట్ ఫాదర్ ధన్‌రాజ్ అభినందించారు.

12 మంది ఎంపిక

జియ్యమ్మవలస: మండలంలోని తిరుమలసాయి పాఠశాలలో చదవుతున్న 12 మంది విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇటీవల విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్షలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనిబరిచారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం అభినందించారు.

గరుగుబిల్లి: మండలంలోని రావివలస ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న శీరాపు నేతాజీ నవోదయకు ఎంపికయ్యారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఆరో తరగతిలో సీటు సాధించాడు. విద్యార్థిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటు హక్కుపై అవగాహన



గిరిజనులకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై అవినాష్

జియ్యమ్మవలస: మండలంలోని గిరిశిఖర గ్రామమైన ద్రాక్షణిలో పోలింగ్ కేంద్రాన్ని ఎస్సై అవినాష్ సోమవారం పరిశీలించారు. ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

సీతంపేటలో చలివేంద్రం ఏర్పాటు



సీతంపేటలో శివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం



అట్టలి చలివేంద్రం వద్ద తాగునీటిని అందిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ



ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

సీతంపేట: ఎండలు మండుతుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సీతంపేట శివాలయం వద్ద సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఈఓపీఆర్డీ కె. సత్యం తెలిపారు. వృద్ధులకు ఓఆర్ఎస్ కలిపిన నీటిని పంపిణీ చేశారు. అలాగే కుశిమి, దోనుబాయి, చిన్నబగ్గ, గొయిది, పెదరామ, కుడ్డపల్లి, తదితర గ్రామ పంచాయతీల పరిధిలో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శనరావు, సచివాలయ, మెడికల్ సిబ్బంది, క్లాప్‌మిత్రులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చేవారి దాహార్తి తీర్చేందుకు దీన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకొండ రూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామ కూడళ్ల వద్ద, ప్రధాన రహదారుల్లో చలివేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉందని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాలకొండ మండలం అట్టలి కూడలి వద్ద సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

ఉష్ణోగ్రతల కారణంగా జాగ్రత్తలు పాటించాలి



తహసీల్దార్ శ్రీనివాసరావు

సీతానగరం: నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లవద్దని, ఒంట్లోనే ఉండాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులంతా ఉదయం 10 గంటలకే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుని విశ్రాంతి తీసుకోవాలని కోరారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు పనుల్లో పాల్గొని సాయంత్రం వేతనం గిట్టుబాటయ్యే విధంగా పనులు చేయాలని సూచించారు. వేసవిలో తిరుగాడే ప్రజలు, వాహన చోదకులు, ప్రయాణికులకు అందు బాటులో తాగునీరుండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర రహదారిలో లచ్చయ్యపేట, అంటిపేట, చినబోగిలి, సీతానగరం, జోగింపేట, గుచ్చిమి,మరిపివలస గ్రామాల కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే పశువులను ఉదయం, సాయంత్రం పూటల్లోనే మేతకు తరలించాలని, ఎండ సమయంలో చల్లని నీడనిచ్చే పాలలు, తోటల్లో ఉంచాలని కోరారు.

ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలి

పార్వతీపురంటౌన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని తహసీల్దార్ కె.అరవిందరావు అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రిసైడింగ్ అధికారులతో ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు తదితర ప్రచార సామగ్రి ఉండరాదని స్పష్టం చేశారు. ఎంసీసీ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఎటువంటి అలసత్వం వహించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అవగాహన

సీతానగరం: జూన్ 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే బీఎల్వోలు, సహాయ ఎన్నికల అధికారులు, డిజిటల్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన మెలకువలు అలవర్చుకోవాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి, సెక్టోరల్ ఎన్నికల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలు సకాలంలో సక్రమంగా నిర్వహించడం అందరి సహకారంతో సాధ్యమన్నారు. అలాగే ఓటర్లకు కనీస సదుపాయాల ఏర్పాటు, వృద్ధులు, వికలాంగులు వారి ఓటుహక్కు వినియోగించే క్రమంలో సమస్యలను సున్నితంగా పరిష్కరిం చడానికి ముందుగా శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించుకోవాలని సూచించారు. తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటింగ్ మెషీన్ల ఉపయోగం, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, తాగునీరు సమకూర్చడం తదితర అంశాలను వివరించారు.

వేడుకగా నవరాత్రుల ముహూర్తపు రాట



నెయ్యిలవీధిలో ముహుర్తపు రాట కార్యక్రమం

సాలూరు: ఉగాది రోజున ప్రారంభమయ్యే సీతారామ వసంత నవరాత్రుల వేడుకకు స్థానిక నెయ్యిలవీధిలోని శ్రీరామమందిరం వద్ద వేడుకగా సోమవారం ముహూర్తపు రాటను వేశారు. సింగిడి వెంకటేష్, కావ్య దంపతులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆకేటి రాము, స్థానిక నాయకులు టిక్కలి ధర్మారావు పాల్గొన్నారు.

వైభవంగా శివాలయ ప్రారంభోత్సవం



గరుగుబిల్లి: ముర్రాటలు తీసుకువెళ్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని గిజబ పునరావస గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితులు పి.రాంబాబు పర్యవేక్షణలో వేదపండితులు దుర్గాప్రసాద్ శర్మ, మణికంఠ శర్మ స్వామివారికి ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యహవాచనం, రక్షాబంధన, పరిషత్, దీక్షారాధన, యాగశాల, గ్రామప్రదక్షిణ, జలాదివాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు బిందెలతో నీటిని ఊరేగింపుగా తీసుకొనివచ్చి స్వామికి అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కోలాటం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ నెల 3న ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

పరజపాడులో..

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌరీసుందరేశ్వర గణేశ సుబ్రహ్మణ్య నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారభమయ్యాయి. భక్తులు ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ గుంట్రెడ్డి రామకృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ గుంట్రెడ్డి అప్పలనాయుడుతో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కొమరాడ: మండలంలోని మాదలింగి గ్రామంలో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. సారా విక్రయంపై అందిన ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేయగా.. ఓ మహిళ వద్ద 50 సారా ప్యాకెట్లు గుర్తించామని ఎస్సై నీలకంఠం తెలిపారు. సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్యం, సారా రవాణా, విక్రయాలపై నిఘా పెట్టామని, వాటితో ఎవరైనా పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు

వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాలు మృతి



మృతదేహానికి నివాళులు అర్పిస్తూ బోరున విలపిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సోమగండి మాజీ సర్పంచ్ సవర గోపాలు (55) అనారోగ్యంతో ఆదివారం రాత్రి తన స్వగ్రామమైన అక్కన్నగూడ గ్రామంలో మృతి చెందారు. ఈయన మృతితో సోమగండి పంచాయతీ శోక సంద్రంగా మారింది. విషయం తెలుసుకున్న పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం గ్రామానికి చేరుకుని, మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి భార్య సవర రుతోనిని ఓదార్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, ఉప సర్పంచ్ బి.మంజుల, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్. మహేష్, బి.రామారావు, ఎస్.రమేష్, మోజేషు, వెంకటేష్, కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులున్నారు.

పింఛన్‌దారుల ఉసురు తగులుతుంది



రాధిక, జెడ్పీటీసీ

గుమ్మలక్ష్మీపురం: వలంటీర్ల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీని అడ్డుకున్న ప్రతిపక్షాలకు పింఛన్‌దారుల ఉసురు తగులుతుందని జెడ్పీటీసీ మండంగి రాధిక అన్నారు. తాడికొండ గ్రామంలోని ఆమె స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతీ నెల ఒకటో తేదీన వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందిస్తున్నారన్నారు. కానీ ఇప్పుడు చంద్రబాబు నిర్వాకంతో లబ్ధిదారులు గ్రామ సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతిపక్ష నాయకులైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మొదటి నుంచి వలంటీర్ల మీద అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారని, అందులో భాగంగానే వారి సేవలను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల నియమాలపై అవగాహన



సుంకిలో అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్‌టీ బృందం

గరుగుబిల్లి: ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కలిగివుండాలని ఎఫ్ఎస్‌టీ బృంద సభ్యులు బి.గౌరీశంకరరావు అన్నారు. మండలంలోని పెదగుడబ, చినగుడబ, ఉద్దవోలు, సుంకి తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఎన్నికల నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వై.డి.దొర, జి.శ్రీహరి, తదితరులున్నారు.